# సాక్షి వరంగల్

ఆదివారం | 10 | డిసెంబర్ | 2023




**బీమా..ధీమా**

ఎల్‌పీజీ సంస్థలు అందిస్తున్న బీమా సదుపాయం వినియోగదారులకు ధీమా కల్పిస్తోంది.

- 8లో ▸



**అంబాలలో ఉద్రిక్తత**

జనావాసాల మధ్య ఉన్న వైన్స్‌ను తొలగించాలని హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం అంబాల వాసులు ఆందోళన చేశారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
$30^0 / 17^0$

**వాతావరణం**

జిల్లాలో ఉదయం నుంచి చలి ఉంటుంది. సాయంత్రం ఆహ్లాదంగా ఉంటుంది. రాత్రి వేళ మంచు కురుస్తుంది.

## న్యూస్‌రీల్

### రైతులు ఆవులను పెంచుకోవాలి



వర్ధన్నపేట : రైతులు ఆవులను పెంచుకోవాలని తెలంగాణ గోశాల ఫెడరేషన్ గౌరవ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్, రాష్ట్ర అధ్యక్షుడు గాడిపల్లి రాజేశ్వర్‌రావు సూచించారు. ఆవుల నుంచి లభించే పేడ, మూత్రం, పాలతో సేంద్రియ వ్యవసాయం చేయాలని పేర్కొన్నారు. మండలంలోని రామవరం మహానంది గోశాల ఆధ్వర్యంలో 10 మంది రైతులకు 20 లేగ దూడలను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు గోవు పేడ, మూత్రంతో పంటలు సాగు చేయాలని కోరారు. రసాయన ఎరువులు, పురుగు మందులతో భూసారం తగ్గుతుందని పేర్కొన్నారు. గోవు పేడ, మూత్రంతో భూసారం పెంపొందడంతోపాటు నాణ్యమైన పంటలు పండుతాయని తెలిపారు. కాలుష్యం సైతం తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో గోశాల ప్రతినిధులు దుర్గం రోజా, యాకూబ్, రామచంద్రు, రైతులు పాల్గొన్నారు.

### కార్యకర్తలు అధైర్యపడొద్దు



రాయపర్తి : కార్యకర్తలు అధైర్యపడొద్దని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, ప్రజాతీర్పును గౌరవిస్తున్నానన్నారు. పాలకుర్తి నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమాన్ని కొనసాగేలా చూద్దామన్నారు. పదవి ఉన్నా లేకపోయినా కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని హామీ ఇచ్చారు. సమావేశంలో గాంధీనాయక్, ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, నాయకులు బిల్లా సుధీర్‌రెడ్డి, ఆకుల సురేందర్‌రావు, రామచంద్రారెడ్డి, జక్కుల వెంకట్‌రెడ్డి, గట్టు నర్సింహాచార్యులు, పూస మధు, గబ్బెట బాబు, బందెల బాలరాజు, గారె నర్సయ్య, నర్మద తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా సామూహిక సత్యనారాయణ వ్రతాలు



హన్మకొండ కల్చరల్: వేయిస్తంభాల ఆలయంలో కార్తీక మాసోత్సవాల్లో భాగంగా కార్తీక బహుళ ద్వాదశి శనివారం సామూహిక శ్రీసత్యనారాయణస్వామి వ్రతం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయ ప్రధానార్చకుడే గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో అర్చకులు నిత్యాహ్నికం, గణపతి ఆరాధన, శ్రీరుద్రేశ్వర స్వామి వారికి 51 కిలోల పుట్టతేనెతో అభిషేకం చేశారు. అనంతరం ఆలయ నాట్య మండపంలో ప్రత్యేక పీఠంపై శ్రీరమాసత్య నారాయణ స్వామిని ప్రతిష్ఠించి గణపతి నవగ్రహారాధన, మంటపారాధన, అష్టదిక్పాలక పూజ, కలశ పూజ, శ్రీసత్యనారాయణస్వామికి పురుష సూక్త విధానంతో పంచామృతాభిషేకం జరిపారు. జగదీశ్ మందిర్ ఆలయ అర్చకులు జితేందర్‌దాస్ సత్యనారాయణస్వామి వ్రత కథలను భజన గీతాలతో రాగయుక్తంగా వినిపించారు. సాయంత్రం ప్రదోషకాల పూజలు, మహిళలు దేవాలయంలో కార్తీకదీపాలు, ఉసిరిక దీపాలు వెలిగించారు. ఆలయ ఈఓ వెంకటయ్య పర్యవేక్షించారు. ఆదివారం లక్షబిల్వార్చన, సామూహిక వనభోజనాలు ఏర్పాటు చేశామని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ కోరారు.

### రామప్పలో పర్యాటకుల సందడి

వెంకటాపురం(ఎం): మండల పరిధిలోని చారిత్రక రామప్ప దేవాలయంలో శనివారం పర్యాటకుల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు, విద్యార్థులు అధిక సంఖ్యలో తరలివచ్చి రామప్ప రామలింగేశ్వరుడిని దర్శించుకున్నారు. ఆలయ పూజారులు హరీశ్ శర్మ, ఉమాశంకర్ భక్తులకు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేశారు. రామప్ప శిల్పాల వద్ద, నంది విగ్రహం వద్ద పర్యాటకులు ఫొటోలు దిగుతూ ఆనందంగా గడిపారు. అదే విధంగా రామప్ప దేవాలయాన్ని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ సందర్శించి రామలింగేశ్వరస్వామికి పూజలు చేశారు. రామప్ప ఆలయ విశిష్టత గురించి టూరిజం గైడ్ వెంకటేష్ వివరించగా రామప్ప శిల్పకళా సంపద అద్భుతంగా ఉందని కొనియాడారు.

# సీతక్కకు పీఆర్.. సురేఖకు ఫారెస్ట్

**మంత్రులకు శాఖలు కేటాయించిన సీఎం రేవంత్‌రెడ్డి**

- అసెంబ్లీలో ఉమ్మడి వరంగల్ నుంచి 10 మంది ఎమ్మెల్యేల ప్రమాణస్వీకారం
- కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి గైర్హాజరు
- ఎమ్మెల్సీ పదవులకు రాజీనామా చేసిన 'పల్లా', 'కడియం'



ప్రమాణ స్వీకారం చేస్తున్న ములుగు ఎమ్మెల్యే, మంత్రి ధనసరి సీతక్క



ప్రమాణ స్వీకారం చేస్తున్న వరంగల్ తూర్పు ఎమ్మెల్యే, మంత్రి కొండా సురేఖ

సాక్షిప్రతినిధి, వరంగల్: ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి ప్రమాణ స్వీకారం చేసిన ఇద్దరు మంత్రులకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి శనివారం శాఖలు కేటాయించారు. ఈనెల 3న ఎన్నికల ఫలితాలు వెలువడగా.. 7న కొత్త ప్రభుత్వం ఏర్పడింది. సీఎం రేవంత్‌రెడ్డి సహా 12 మంది ప్రమాణ స్వీకారం చేయగా.. ఆ రోజు ఎవరికీ శాఖలు కేటాయించలేదు. అసెంబ్లీలో ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారం చేయడానికి ముందే మంత్రులకు శాఖలు కేటాయించారు. మంత్రులు కొండా సురేఖ, ధనసరి సీతక్క సహా ఉమ్మడి వరంగల్ నుంచి 10 మంది ఎమ్మెల్యేలు అసెంబ్లీలో ప్రమాణం చేయగా.. బీఆర్‌ఎస్‌కు చెందిన ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి హాజరు కాలేదు.

**ప్రమాణం చేసింది పది మందే..**

ఉమ్మడి వరంగల్ నుంచి 12 మంది శాసనసభ్యులు ఎన్నికవగా 10 మంది ఎమ్మెల్యేలు మాత్రమే ప్రమాణ స్వీకారం చేశారు. మంత్రులు ధనసరి సీతక్క, కొండా సురేఖతో పాటు ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాష్‌రెడ్డి (పరకాల), దొంతి మాధవరెడ్డి (నర్సంపేట), నాయిని రాజేందర్‌రెడ్డి (వరంగల్ పశ్చిమ), డాక్టర్ రామచంద్రునాయక్ (డోర్నకల్), డాక్టర్ మురళీ నాయక్ (మహబూబాబాద్), మామిడాల యశస్వినిరెడ్డి (పాలకుర్తి), గండ్ర సత్యనారాయణరావు (భూపాలపల్లి), కేఆర్.నాగరాజు(వర్ధన్నపేట)తో ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ శనివారం ప్రమాణం చేయించారు. 10 మందిలో ఆరుగురు అసెంబ్లీలో మొదటిసారిగా అడుగు పెట్టారు. బీఆర్‌ఎస్ నుంచి గెలుపొందిన ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి (స్టేషన్ ఘన్‌పూర్), పల్లా రాజేశ్వర్‌రెడ్డి (జనగామ) అసెంబ్లీకి హాజరు కాలేదు. అయితే ఎమ్మెల్సీ పదవులకు రాజీనామా చేయలేదనే కారణంతో వారు ప్రమాణ స్వీకారానికి హాజరు కాలేదని సమాచారం.

**ఎమ్మెల్సీ పదవులకు రాజీనామా..**

పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కడియం శ్రీహరి ఎమ్మెల్సీ పదవులకు రాజీనామా చేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వీరు జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. హుజూరాబాద్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన పాడి కౌశిక్‌రెడ్డి కూడా తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. ఈ ముగ్గురి పదవీకాలం 2027 వరకు ఉంది. అయితే పదవీ నిబంధనల ప్రకారం 15 రోజుల్లోపు ఏదో ఒక సభ్యత్వానికి రాజీనామా చేయాలి. ఖాళీ అయిన స్థానానికి ఎన్నికల కమిషన్ ఆరు మాసాలలోపు ఎన్నికలు నిర్వహిస్తుంది. ఈ నేపథ్యంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని కలిసి ఎమ్మెల్సీలుగా రాజీనామా చేస్తున్నట్లు వారు లేఖలు అందజేశారు. రాజీనామాలను మండలి చైర్మన్ శనివారం ఆమోదించారు.

**ఇద్దరికీ కీలక శాఖలు**

ఉమ్మడి జిల్లాకు రెండు మంత్రి పదవులు దక్కడంతోపాటు వారిని ప్రాధాన్యత కలిగిన శాఖలు వరించాయి. ములుగు ఎమ్మెల్యే, మంత్రి ధనసరి సీతక్క(అనసూయ)కు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటిసరఫరాతో పాటు మహిళా, శిశుసంక్షేమ శాఖలు కేటాయించారు. అలాగే వరంగల్ తూర్పు ఎమ్మెల్యే, మంత్రి కొండా సురేఖకు అటవీశాఖతో పాటు పర్యావరణం, దేవాదాయ శాఖలు దక్కాయి. గత ప్రభుత్వంలో మంత్రిగా ఎర్రబెల్లి దయాకర్‌రావు నిర్వహించిన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటిసరఫరా శాఖలతో పాటు సత్యవతిరాథోడ్ చూసిన మహిళా, శిశుసంక్షేమ శాఖలను సీతక్కకు కట్టబెట్టారు. దీంతో మంత్రి వర్గంలో ఆమెకు పెద్దపీట వేసినట్లుగా కనిపిస్తున్నది. అలాగే కొండా సురేఖకు అప్పగించిన అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖలను గత ప్రభుత్వంలో నిర్మల్ జిల్లాకు చెందిన అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి చూశారు.






ప్రమాణ స్వీకారం చేస్తున్న నర్సంపేట, వర్ధన్నపేట, పాలకుర్తి, పరకాల ఎమ్మెల్యేలు దొంతి మాధవరెడ్డి, కేఆర్.నాగరాజు, యశస్వినిరెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి

# మురిసిన మహిళలు



వరంగల్‌లో ఉచిత బస్సును ప్రారంభించిన కలెక్టర్ ప్రావీణ్య, అధికారులు

- ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సేవలు షురూ
- ఎంజీఎం ఎదుట ప్రారంభించిన కలెక్టర్ ప్రావీణ్య
- త్వరలో మహాలక్ష్మి స్మార్ట్‌కార్డుల పంపిణీకి ఏర్పాట్లు

ఎంజీఎం/నర్సంపేట రూరల్/వర్ధన్నపేట : మహాలక్ష్మి పథకంతో మహిళా లోకం మురిసింది. ఆరు గ్యారంటీల్లోని ఆర్టీసీ బస్సుల్లో మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్స్‌కు ఉచిత ప్రయాణ సేవలను కాంగ్రెస్ ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. ఈ మేరకు వరంగల్ నగరంలో శనివారం మహాలక్ష్మి పథకాన్ని అధికారులు ప్రారంభించారు. వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి వద్ద బస్సును కలెక్టర్ ప్రావీణ్య ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్స్ ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చని వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీ పథకాల్లో మహాలక్ష్మి పథకం కూడా ప్రవేశపెట్టినట్లు తెలిపారు. పేద మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం ద్వారా ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. జిల్లాలోని 57 సిటీ బస్సులు, 471 పల్లెవెలుగు, 213 ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహాలక్ష్మి పథకం అమలవుతోందని వెల్లడించారు. ఈ పథకం కింద మహిళలకు త్వరలో ప్రభుత్వం మహాలక్ష్మి స్మార్ట్‌కార్డులు అందించనున్నట్లు తెలిపారు. ఎంజీఎం నుంచి మహిళలతో కలిసి కలెక్టర్ బస్సులో ప్రయాణించారు. జీరో టికెట్ తీసుకుని వరంగల్ బస్ స్టేషన్ వరకు వెళ్లారు. కార్యక్రమంలో ఆర్డీఓ వాసుచంద్ర, ఆర్టీసీ డిప్యూటీ రీజినల్ మేనేజర్ భానుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

**సంతోషంగా ఉంది..**



కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం సంతోషంగా ఉంది. ఖానాపురం మండలంలోని కొత్తూరు రంగాపురం గ్రామం నుంచి ఉదయం శుభకార్యం కోసం వరంగల్‌కు చార్జీ పెట్టుకుని బస్సులో వెళ్లాను. తిరిగి సాయంత్రం చార్జీ లేకుండానే ఆర్టీసీ బస్సులో క్షేమంగా ఇంటికి చేరుకున్నా.

లావుడ్య సరోజన

**మహిళలకు పెద్దపీట..**



కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించి మహిళలకే పెద్దపీట వేసింది. మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలం చిన్న నాగారం నుంచి నెక్కొండకు మధ్యాహ్నం చార్జీ పెట్టుకుని బస్సులో వచ్చాను. నెక్కొండ నుంచి సాయంత్రం నర్సంపేటకు బస్సు ఎక్కగా చార్జీ లేదని కండక్టర్ తెలిపాడు.

కొమురమ్మ, ప్రయాణికురాలు

**మహిళలు మర్చిపోలేరు**



సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా ఈ పథకం అమలు చేయడం మహిళలు ఎప్పటికీ మరిచిపోరు. మాది ఖానాపురం పని నిమిత్తం దుగ్గొండి మండలంలోని గిర్నిబావి గ్రామానికి ఉదయం బస్సు చార్జీతో వెళ్లాను. సాయంత్రం తిరిగి వచ్చే సరికి బస్సు చార్జీ తీసుకోవడం లేదు. చాలా సంతోషంగా ఉంది.

– నీలమ్మ, ప్రయాణికురాలు

**ఉచితంగా తీసుకెళ్లారు..**



మాది రాయపర్తి మండలం తిర్మలాయపల్లి గ్రామం. శనివారం ఉదయం టికెట్ పెట్టుకుని వరంగల్‌లోని మా బంధువుల ఇంటికి వెళ్లాను. తిరుగు ప్రయాణంలో వరంగల్‌లో తొర్రూరు డిపో బస్సు ఎక్కాను. ఉచితంగా తీసుకెళ్లారు. ఎంతో సంతోషంగా ఉంది. కాగా బస్సులో అధిక సంఖ్యలో మహిళలే ఉన్నారు.

గడ్డం కళావతి, తిర్మలాయపల్లి



నర్సంపేట రూరల్ : నర్సంపేటలో ఉచిత బస్సును ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు



వర్ధన్నపేటలో బస్సు ఎక్కుతున్న మహిళా ప్రయాణికులు

# కాళేశ్వరాలయంలో భక్తుల సందడి

కాళేశ్వరం: కార్తీక మాసం సందర్భంగా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ముందుగా త్రివేణి సంగమ గోదావరిలో పుణ్యస్నానాలు చేశారు. అనంతరం స్వామివారి గర్భగుడిలో అభిషేక పూజలు చేశారు. శ్రీసుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో కాలసర్ప, నవగ్రహాల వద్ద భక్తులు శనిపూజలు నిర్వహించారు. ఉసిరి చెట్టు వద్ద మహిళలు పూజలు చేసి దీపారాధనలు చేశారు. దీంతో ఒక్క రోజు వివిధ పూజలు, లడ్డు ప్రసాదాల ద్వారా ఆలయానికి రూ.3.50లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.



ఆలయంలో అభిషేకాలు చేస్తున్న భక్తులు

# ఆరోగ్యశ్రీతో నాణ్యమైన వైద్య సేవలు

- కలెక్టర్ ప్రావీణ్య

ఎంజీఎం : పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పెంచిందని కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి అకడమిక్ హాల్‌లో రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని రూ.10 లక్షలకు పెంచే కార్యక్రమాన్ని ఆమె అధికారులతో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్‌ను లాంఛనంగా రాజధానిలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించినట్లు, దానికి అనుగుణంగా జిల్లాలో కూడా ఈ సేవలు అందనున్నట్లు తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 2,66,678 మందికి రాజీవ్ ఆరోగ్యశ్రీ కార్డులు ఉన్నాయని వెల్లడించారు. పేదలు జిల్లాలోని 5 ప్రభుత్వ ఆస్పత్రులు, 12 ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యసేవలు పొందవచ్చని సూచించారు. ఈ పథకంలో భాగంగా లబ్ధిదారులకు ఉచిత వైద్యం, భోజనం, రవాణా సౌకర్యం అందించనున్నట్లు తెలిపారు. ఈ పథకాన్ని ఆరోగ్య సిబ్బంది విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని అదేశించారు. కార్యక్రమంలో ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, డీఎంహెచ్ఓ వెంకటరమణ, డీఈఓ వాసంతి, ఆర్ఎంఓ మురళి, కేఎంసీ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాంకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



ఎంజీఎం ఆస్పత్రిలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

# అంబరాన్నంటిన పంబారట్టు



పంబారట్టుకు స్వాగతం పలుకుతున్న పెద్ది



అయ్యప్పస్వామికి పూలతో అభిషేకం..

- శరణుఘోషతో మార్మోగిన మాదన్నపేట చెరువు కట్ట
- సంప్రదాయబద్ధంగా అయ్యప్పస్వామికి తాంత్రిక పూజలు

నర్సంపేట రూరల్ : మాదన్నపేట చెరువు కట్టపై శనివారం పంబారట్టు వైభవంగా నిర్వహించారు. నర్సంపేటలోని శ్రీధర్మశాస్తా అయ్యప్పస్వామి దేవాలయ గురుస్వామి వెంకటేశ్వరశర్మ, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సమక్షంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం నుంచి వరంగల్ రోడ్డు కూడలి, బస్టాండ్, అంగడి సెంటర్, అంబేడ్కర్ సెంటర్, జయలక్ష్మి సెంటర్ మీదుగా కమలాపురం గ్రామం నుంచి మాదన్నపేట చెరువు వద్దకు ర్యాలీ నిర్వహించారు. శబరిమలలో నిర్వహించిన మాదిరిగానే అయ్యప్పస్వామికి నర్సంపేటలో 23 సంవత్సరాలుగా తాంత్రిక పూజలు, 18 సంవత్సరాలుగా పంబారట్టు నిర్వహిస్తున్నారు. చెరువు కట్టపై ఏర్పాటు చేసిన స్టేజీపై స్వామికి వారికి అష్టాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి గురుస్వామి మంగళహారతి ఇచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఏసీపీ తిరుమల్ ఆధ్వర్యంలో నర్సంపేట టౌన్ సీఐ రవి కుమార్, రూరల్ సీఐ కిషన్, నెక్కొండ సీఐ హతిరాం భారీ బందోబస్తు నిర్వహించారు. నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ గుంటి రజిని ప్రారంభించారు. మాదన్నపేట సర్పంచ్ మొల్గూరి చంద్రమౌళి, ఎంపీటీసీ ఊడ్గుల రాంబాబు, ఆలయ కమిటీ చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఫిర్యాదు చేస్తే తక్షణమే స్పందిస్తాం

● సీపీ అంబర్ కిషోర్ ఝా



వరంగల్ క్రైం: శాంతి భద్రతలు, ఇతర ఫిర్యాదులు చేసినా వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకుంటామని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిషనరేట్ పరిధి శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలతో పాటు ప్రజలు పోలీస్ కమిషనర్‌కు మరింత సులువుగా తమ ఫిర్యాదులు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. ఫిర్యాదారులు తమ ఫిర్యాదులను కమిషనరేట్‌లోని సెంట్రల్ కంప్లయింట్ సెల్ విభాగంలో అందించాలని, ఫిర్యాదు చేయాలనుకుంటే 87126 85061, 87126 85070 నంబర్లకు ఫోన్ ద్వారా గానీ, వాట్సాప్ ద్వారా కుడా ఫిర్యాదులు అందించవచ్చని సూచించారు. ఫిర్యాదుదారులు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటలోపు అందించాలని తెలిపారు. కాగా.. పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదులు అందించడానికి ముందు స్థానిక పీఎస్‌లో ఫిర్యాదు చేసి ఉండాలని సీపీ పేర్కొన్నారు.

## శాంతి సమాధానాలు ప్రకటించాలి

వరంగల్: దైవ సేవకులు శాంతి సమాధానాలు ప్రకటించాలని దక్షిణ ఇండియా సంఘం కరీంనగర్ అధ్యక్ష మండల బిషప్, సినాడ్ ఇన్‌చార్జ్ మోడరేటర్ ది రైట్ రెవ డాక్టర్ రూబెన్ మార్క్ అన్నారు. మండలంలోని దేశాయిపేటలోని సీఎస్ఐ చర్చిలో శనివారం వరంగల్ గ్రూప్ చర్చి కౌన్సిల్ క్లెర్జి ఫ్యామిలీ క్రిస్మస్ వేడుకలు జరిగాయి. ఈ వేడుకల్లో ఆయన మాట్లాడారు. ప్రపంచానికి శాంతి సందేశం అందించడానికి మానవ అవతారిగా జన్మించిన క్రీస్తు సందేశం ప్రజలకు అందించాలన్నారు. ఈ వేడుకల్లో వరంగల్ గ్రూప్ చైర్‌పర్సన్ సుప్రియ సర్వేశ్, అశోక్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



# బీమా..ధీమా

● వంట గ్యాస్‌కూ క్లెయిమ్
● సిలిండర్ పేలితే రూ. 40 లక్షల వరకు పరిహారం

కాజీపేట: ప్రస్తుత కాలంలో వంట గ్యాస్ (ఎల్‌పీజీ) లేని కుటుంబం లేదు. ప్రతి ఒక్కరికీ నిత్యావసరంగా మారింది. ఈ క్రమంలో ఒక్కోసారి గ్యాస్ లీకేజీ, విద్యుత్ షార్ట్ సర్క్యూట్, అజాగ్రత్తల వల్ల పేలుళ్లు సంభవిస్తున్నాయి. అయితే ఇందుకు సంబంధించి ఆయా ఎల్పీజీ సంస్థలు అందిస్తున్న బీమా సదుపాయం వినియోగదారులకు ధీమా కల్పిస్తోంది. ఈ నేపథ్యంలో వంట గ్యాస్ వల్ల ప్రమాదం సంభవిస్తే దీనికి సంబంధించిన బీమా క్లెయిమ్ ఎలా చేసుకోవాలి? నిబంధనలు ఏమిటీ? తదితర వివరాలు మీ కోసం..

**పబ్లిక్ లయబిలిటీ ఇన్సూరెన్స్ ..**
ఎల్‌పీజీ వినియోగదారులకు 'పబ్లిక్ లయబిలిటీ ఇన్సూరెన్స్' కింద బీమా సౌకర్యం కల్పిస్తున్నాయి. ఆయా కంపెనీల్లో నమోదైన ప్రతి ఖాతాదారుడికీ ఇది వర్తిస్తుంది. ఈ పాలసీలో థర్డ్ పార్టీ బీమా కూడా మిళితమై ఉంటుంది.

**బీమా పరిహారం పొందాలంటే..**
ఇంట్లో వంట గ్యాస్ సిలిండర్ పేలితే వెంటనే సంబంధిత కంపెనీ డిస్ట్రిబ్యూటర్ లేదా డీలర్‌కు విషయం తెలపాలి. అతడు ఆ కంపెనీ సేల్స్ అధికారికి సమాచారం ఇస్తారు. దీంతో సేల్స్ అధికారి, స్థానిక తాహసీల్దార్, ఇన్సూరెన్స్ సర్వేయర్, అగ్నిమాపక శాఖ అధికారి వచ్చి ఘటనా స్థలిని పరిశీలించి చుట్టుపక్కల వారిని విచారిస్తారు. అనంతరం ఇన్సూరెన్స్ క్లెయిమ్ చేస్తారు. గ్యాస్ సిలిండర్ ఎక్కడ బుక్ చేసుకుంటారో.. ఆ డీలర్ నుంచే ఇన్సూరెన్స్ కూడా క్లెయిమ్ అవుతుంది.

**బీమా పరిహారం ఇలా...**
గ్యాస్ ప్రమాదంలో వ్యక్తి మృతి చెందితే సుమారు రూ. 6 లక్షలు, గాయాలైతే రూ. 25 వేల నుంచి రూ.2లక్షలు, ప్రమాదం జరిగిన సమయంలో గృహోపకరణాలు, ప్రమాదం చోటు చేసుకున్న ఇంటికి నష్టం జరిగితే బీమా కంపెనీ సర్వేయర్ సర్వే నివేదిక ఆధారంగా రూ.2లక్షల వరకు పరిహారం చెల్లిస్తారు. అలాగే, వినియోగదారుడి ఇంట్లో గ్యాస్ లీక్ వల్ల చుట్టు పక్కల ఉండే నివాసాల్లో ప్రమాదం జరిగితే ఆ ప్రమాదానికి సంబంధించి మొత్తం కలిపి రూ.40 లక్షల బీమా వర్తిస్తుంది.



అశ్రద్ధగా ఉండడంతో గ్యాస్ లీకై చెలరేగుతున్న మంటలు(ఫైల్)

**డిస్ట్రిబ్యూటర్‌కు సమాచారం..**
సిలిండర్ పేలితే డిస్ట్రిబ్యూటర్‌కు వెంటనే సమాచారం అందించి, కంపెనీ పుస్తకం, బుక్ చేసుకున్న రశీదు, ప్రమాదం జరిగిన ఇంటి నంబర్, పరిహారం కోరుతూ అర్జీతో పాటు డిస్ట్రిబ్యూటర్ వద్ద ఉండే బీమా క్లెయిమ్ దరఖాస్తు పూరించి అందించాలి. వంట గ్యాస్ ప్రమాదం, ఇన్సూరెన్స్ గురించి పౌరసరఫరాల శాఖకు ఎలాంటి సంబంధం ఉండదు.

**గ్యాస్ ఏజెన్సీలు ఏం చేయాలి..**
గ్యాస్ ప్రమాద బీమాపై సభలు, సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజల్లో చైతన్యం కల్పించాలి. బీమాపై విస్తృత ప్రచారం చేపట్టాలి. వినియోగదారుల సేవలు, ప్రమాదాలు, పరిహారంపై సంస్థలు ఇచ్చే భరోసాపై చైతన్యం కలిగించాలి. ఏజెన్సీ ప్రతినిధులు రెండేళ్లకొకసారి వినియోగదారులు వాడుతున్న గ్యాస్ పొయ్యిలు, సిలిండర్, రెగ్యులేటర్లను పరిశీలించాలి.

**వినియోగదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు..**
ఇళ్లు, హోటళ్లు, వసతి గృహాల్లో వంట గ్యాస్ వినియోగదారులు ప్రతి మూడు, ఆరు నెలలకోసారి గ్యాస్ పొయ్యిలను ఏజెన్సీ నియమించిన మెకానిక్‌లతో పరిశీలింపజేయాలి. రెగ్యులేటర్‌కు, పొయ్యికి అనుసంధానం చేసేందుకు నాణ్యమైన పైపునే వాడాలి. సిలిండర్‌కు దగ్గరలో మండే వస్తువులు ఉంచకూడదు. వంట గదిలోకి తగినంత గాలి, వెలుతురు వచ్చేలా చూసుకోవాలి. సిలిండర్‌ను స్వేచ్ఛగా బయటకు తెచ్చేందుకు అవకాశం ఉండేలా ఏర్పాటు చేసుకోవాలి. సిలిండర్ ఎప్పుడు నిలువుగా ఉండాలి. ఎట్టి పరిస్థితుల్లో అడ్డంగా ఉండరాదు. సిలిండర్ కంటే పొయ్యిని ఎక్కువ ఎత్తులో ఏర్పాటు చేసుకోవాలి. గ్యాస్ లీకైనప్పుడు బరువైన మిథేన్ వాయువు భూమిని చేరి తర్వాత పైకి వస్తుంది. గ్యాస్ లీకైనట్లు అనుమానం వస్తే విద్యుత్ పరికరాలు, స్విచ్‌లు ఆన్, ఆఫ్ చేయొద్దు. రెగ్యులేటర్‌ను ఆఫ్ చేసి మూత పెట్టాలి.

**కావాల్సిన ధ్రువీకరణ పత్రాలు..**
- మరణాలు చోటు చేసుకుంటే మరణ ధ్రువీకరణ పత్రం, పోస్టుమార్టం రిపోర్ట్, అగ్నిమాపక అధికారి నివేదిక, ప్రమాదం జరిగినట్లు రిపోర్ట్ పత్రాలు ఒరిజినల్స్ జత పరచాలి.
- గాయపడిన సందర్భంలో వైద్యుడి ప్రిస్క్రిప్షన్, మందులు కొనుగోలు చేసినట్లు దుకాణం నుంచి పొందిన బిల్లులు, ఆసుపత్రిలో చికిత్స పొందినట్లు వైద్యుడి ధ్రువీకరణ పత్రం, డిశ్చార్జి కార్డు జతపరచాలి.
- ఆస్తి నష్టానికి సంబంధించి బీమా కంపెనీ సర్వేయర్ ఇచ్చిన ధ్రువీకరణ పత్రం ఉండాలి.

**ఇలా అయితే బీమా వర్తించదు..**
- సిలిండర్ బుక్ చేసుకున్న ఇంటి నంబర్ కాకుండా మరో ఇంటిలో ప్రమాదం జరిగితే బీమా వర్తించదు.
- సిలిండర్ లీకైనప్పుడు మాత్రమే బీమా క్లెయిమ్ చేస్తారు. ప్రమాదానికి సంబంధించిన ప్రాంతం, వివరాలు, ఏడు రోజులలోపు సంబంధిత బీమా కంపెనీకి అందినప్పుడే ఈ బీమా క్లెయిమ్ అవుతుంది.
- ఉద్దేశపూర్వకంగా ప్రమాదం సంభవించిందని వినియోగదారుడిపై అనుమానం వచ్చి పోలీస్ విచారణ జరుగుతున్నట్టయితే బీమా వర్తించదు.

# ఏసీబీని ప్రక్షాళన చేయాలి

● జ్వాలా అధ్యక్షుడు ప్రశాంత్

హన్మకొండ: ఏసీబీని ప్రక్షాళన చేసి లంచగొండుల విషయంలో కఠినంగా వ్యవహరించేలా చర్యలు చేపట్టాలని జ్వాలా అవినీతి వ్యతిరేక సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకరి ప్రశాంత్ అన్నారు. అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం 'దున్నపోతులపై నీళ్లు చల్లుతూ' హనుమకొండలోని వేయిస్తంబాల గుడి నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ.. ప్రజల నుంచి లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా ఏసీబీకి చిక్కిన ప్రభుత్వ ఉద్యోగులపై గరిష్ఠంగా మూడు నెలల్లో చార్జ్‌షీట్ వేయాల్సి ఉండగా ఏడాది సమయం తీసుకుంటున్నారని, దీంతో లంచగొండి ఉద్యోగులు కోర్టులకు వెళ్లి స్టే తెచ్చుకుని తిరిగి విధుల్లో చేరి అవినీతిని కొనసాగిస్తున్నారని అన్నారు.



దున్నపోతుపై నీళ్లు చల్లుతూ నిరసన ర్యాలీలో 'జ్వాలా' ప్రతినిధులు

అవినీతిని నిరోధించేందుకు కఠిన చట్టాలు ఉన్నప్పటికీ అమలు కాకపోవడంతో భయం లేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో లోక్‌సత్తా సంస్థ రాష్ట్ర సలహాదారుడు పర్వా కోదండరామారావు, టీఎస్ ఎస్సీడీసీఎల్ ఏడీ అశోక్‌కుమార్, ఎన్‌సీసీ అధికారి కెప్టెన్ సదానందం, అమర్నాథ్, సుంకరి రాజు, ప్రకాష్, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

# అంబాలలో ఉద్రిక్తత



వైన్ షాపు ఎదుట ఆందోళన చేస్తున్న మహిళలు



పోలీస్ పహారా మధ్యం విక్రయిస్తున్న నిర్వాహకులు

● షాపు తొలగించాలని ప్రజల ఆందోళన
● పోలీసులతో వాగ్వాదం.. పలువురిపై కేసు
● పోలీస్ పహారా మధ్య వైన్స్ నిర్వహణ

కమలాపూర్: హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం అంబాలలో జనావాసాల మధ్య ఉన్న వైన్స్‌ను తొలగించాలని డిమాండ్ చేస్తూ స్థానికులు శనివారం రెండో రోజు షాపు ఎదుట ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో కలిసి స్థానిక మహిళలు అక్కడే బైఠాయించారు. సమాచారం అందుకున్న స్థానిక ఎస్సై సీమా ఫర్హీన్, ఎక్సైజ్ ఎస్సై రమ్య సిబ్బందితో చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినా వారు వినకపోవడంతో సుమారు 20 మంది ఆందోళనకారులను పోలీసులు అదుపులోకి తీసుకుని కమలాపూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. ఈ క్రమంలోనే పోలీసులు, స్థానికులకు మధ్య కాసేపు వాగ్వాదం జరిగింది. దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అనంతరం వైన్స్ ఎదుట ఆందోళనకు దిగిన స్థానికులను పోలీసులు అక్కడి నుంచి పంపించి పోలీస్ పహారా నడుమ వైన్స్‌ను తెరిచి అమ్మకాలు కొనసాగించారు.



## ఆనంద హేళా..



హనుమకొండ: మహాలక్ష్మి పథకం జీరో టికెట్ చూపెడుతున్న కలెక్టర్

తెలంగాణ ప్రభుత్వం శనివారం మధ్యాహ్నం మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు సేవలు ప్రారంభించింది. మహాలక్ష్మి పథకంలో భాగంగా చేపట్టిన ఈ స్కీమ్‌లో మహిళలు, బాలికలు, ట్రాన్స్ జెండర్స్ వయసుతో సంబంధం లేకుండా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రయాణించొచ్చు. ఈ పథకాన్ని ఆయా జిల్లాల కలెక్టర్లు ప్రారంభించారు. కాగా, తొలిరోజు మహిళా ప్రయాణికులతో బస్టాండ్‌లు, బస్సులు కిటకిటలాడాయి.

-సాక్షి నెట్‌వర్క్



వరంగల్‌లో బస్సులో ప్రయాణిస్తున్న విద్యార్థినులు



భూపాలపల్లి బస్టాండ్‌లో ప్రయాణికులు



హన్మకొండ : మహిళా ప్రయాణికులతో కిక్కిరిసిన బస్సు



జనగామ: బస్సులో ప్రయాణిస్తున్న విద్యార్థినులు



మహబూబాబాద్: బాలికలు, మహిళలతో కలిసి బస్సులో ప్రయాణిస్తున్న కలెక్టర్ శశాంక



ములుగు: ఆర్టీసీ బస్సు ఎక్కడానికి క్యూ లైన్‌లో ఉన్న మహిళలు

## విద్యార్థినిపై ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తన

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో విద్యార్థిని పట్ల ఓ ఉపాధ్యాయుడు అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వారం రోజుల క్రితం పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థిని పట్ల ఉపాధ్యాయుడు అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో మనస్తాపం చెందిన సదురు విద్యార్థిని హెచ్‌ఎంకు ఫిర్యాదు చేసింది. హెచ్‌ఎం.. సంబంధిత ఉన్నతాధికారులకు విషయం తెలిపారు. దీంతో ఈ ఘటనపై విచారణ జరుపుతున్నట్లు తెలిసింది. కాగా, ఈ విషయమై హెచ్‌ఎం సునీతను ఫోన్‌లో సంప్రదించగా వాస్తమేనని, ఉన్నతాధికారులకు పూర్తి వివరాలు అందజేశానని తెలిపారు.

## జీవితంపై విరక్తి చెంది వ్యక్తి ఆత్మహత్య



శ్రీనివాస్‌రెడ్డి(ఫైల్)

దుగ్గొండి: అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి.. ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం తిమ్మంపేటలో జరిగింది. గ్రామానికి చెందిన నరహరి శ్రీనివాస్‌రెడ్డి(39)కి 20 సంవత్సరాల క్రితం గుండె ఆపరేషన్ జరిగింది. అప్పటి నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీనిపై నిత్యం మదనపడుతుండే వాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది శనివారం తెల్లవారుజామున ఇంట్లో ఉరివేసుకున్నాడు. ఈ ఘటనపై మృతుడి సోదరుడు రాజ్‌కుమార్ రెడ్డి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జక్కుల పరమేష్ తెలిపారు.

**భావుసింగ్‌పల్లిలో మహిళ..**
చిట్యాల: మద్యం మత్తులో ఓ మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన జయశంకర్‌భూపాపల్లి జిల్లా చిట్యాల మండలం భావుసింగ్‌పల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన బానోతు రజిత (47) దివ్యాంగురాలు. కొంతకాలంగా మద్యానికి బానిసైన రజిత.. మద్యం మత్తులో శుక్రవారం రాత్రి పురుగుల మందు తాగింది. కుటుంబీకులు గమనించి భూపాలపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. ఈ ఘటనపై మృతురాలి భర్త భీముడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జంగిలి రమేష్ తెలిపారు.

# జీవాల్లో 'సీజనల్' వ్యాధులు

**గొర్రెలు, మేకలకు వాధ్యులు, కాలి పుండ్లు**
● అప్రమత్తంగా లేకుంటే నష్టం
● ఆరోగ్య సంరక్షణ చేపట్టాలంటున్న శాస్త్రవేత్తలు

కరీమాబాద్: వాతావరణ మార్పుల నేపథ్యంలో గొర్రెలు, మేకలలో సీజనల్ వ్యాధుల భయం వెంటాడుతోంది. రాత్రి వేళల్లో నమోదవుతున్న ఉష్ణోగ్రతలతో చలి ప్రభావం పెరగడం మూలంగా మూగ జీవాలు ఒత్తిడికి గురయ్యే అవకాశముంది. ఈ నేపథ్యంలో వాటి ఆరోగ్య సంరక్షణ కోసం పెంపకందారులు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. లేని పక్షంలో నష్టం వాటిల్లే అవకాశాలున్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ప్రస్తుత శీతాకాలంలో వ్యాధులను ఎప్పటికప్పుడు గుర్తించాలని వారు సూచిస్తున్నారు.

**1. ఊపిరితిత్తులలో నిమోనియా..**
గొర్రెలు, మేకలలో ఊపిరితిత్తులకు నిమోనియా(నిమ్ము) వ్యాధి తరచూ వస్తుంది. వర్షాకాలం, చలికాలంలో వైరస్, బ్యాక్టీరియాల ద్వారా జబ్బు వ్యాపిస్తుంది.

**వ్యాధి లక్షణాలు...**
జ్వరం, దగ్గు, ముక్కు నుంచి నీరు(చీమిడి)కారడం, రాత్రి వేళల్లో ఎక్కువగా దగ్గుతాయి.

**నివారణ చర్యలు..**
జీవాలుండే పాకను పొడిగా ఉంచడమే కాకుండా గాలి, వెలుతురు సమృద్ధిగా వచ్చేలా చూడాలి. దగ్గుతున్న జీవాలను గుర్తించి తొందరగా చికిత్స చేయించాలి.

**వ్యాధికి చికిత్స..**
వ్యాధి నివారణ కోసం స్ట్రెప్టోపెన్సిలిన్, ఎన్రోఫ్లాక్సిన్ మందులు వైద్యుల పర్యవేక్షణలో వారు సూచించిన మోతాదు ప్రకారం 3 నుంచి 5 రోజులు వాడాలి. ఈ క్రమంలోనే మెలోనెక్స్, ఎవిల్ వంటి ఇంజక్షన్‌లు 3 నుంచి 5 రోజులు వేయించాలి.



జీవం గిట్టకు కాలిపుండు

**2. కాలి పుండు వ్యాధి...**
జీవాలు మేతకు వెళ్తున్న సందర్భంలో మందలోని కొన్ని గొర్రెలు, మేకలు కుంటుతూ కనిపిస్తుంటాయి. ఫ్యూజోబ్యాక్టీరియం నేక్రోఫోరం అనే సూక్ష్మజీవుల మూలంగా ఈ వ్యాధి సోకుతుంది. చిత్తడి నేలలపై జీవాలు తిరిగినప్పుడు ఈ లక్షణాలు కనిపిస్తుంటాయి.

**వ్యాధి లక్షణాలు..**
మందలోని జీవాలు సరిగా నడవలేక వెనకబడుతుంటాయి. వాటిని పరిశీలిస్తే గిట్టల మధ్యభాగం ఎర్రగా కందుతుంది. ఎర్రగా కందిన భాగం ఉబ్బి చీము పట్టి దుర్వాసన వస్తుంది. వ్యాధి తీవ్రంగా ఉంటే గిట్టలు కూడా ఊడిపోతాయి. అంతే కాకుండా మేత సరిగా మేయకపోవడంతో బరువు తగ్గుతాయి.

**నివారణ చర్యలు..**
వ్యాధి సోకిన గొర్రెలు, మేకలను మంద నుంచి వేరు చేసి ఇంటి వద్ద విడిగా ఉంచాలి. చిత్తడి నేలల్లో ఎక్కువ సేపు తిరగనీయకుండా పొడి ప్రదేశంలో ఉంచాలి. సిమెంట్ ఫూట్‌బాత్ ఏర్పాటు చేసి అందులో 8 శాతం పొటాషియం పర్మాంగనేట్ ద్రావణం, ఫార్మాలిన్ ద్రావణం పోసి వాటిని రోజూ 3 నుంచి 5 నిమిషాలు నడిపించాలి.

**వ్యాధికి చికిత్స..**
వ్యాధి సోకిన గిట్టలను పొటాషియం పర్మాంగనేట్, ఫార్మలిన్ ద్రావణం, జింక్ సల్ఫేట్ ద్రావణంతో రోజుకు రెండు సార్లు శుభ్రంగా కడగడమే కాకుండా లోరాక్సిన్, హిమాక్స్ వంటి యాంటిబయోటిక్ ఆయింట్‌మెంట్‌ను 15 నుంచి 20 రోజులు పూయాలి. పెన్సిలిన్ ఇంజక్షన్ 3 నుంచి 5 రోజులు వేయించాలి. మెలోనెక్స్ ఇంజక్షన్ వరుసగా 3 నుంచి 5 రోజులు వేయించడం మూలంగా కాళ్ల నొప్పుల నుంచి ఉపశమనం కలుగుతుంది. టాపిక్యూర్ స్ప్రేను గిట్టల మీద 7 రోజుల పాటు వాడితే పుండ్లు త్వరగా మానుతాయి.



మేక ముక్కు నుంచి కారుతున్న నీరు

**జాగ్రత్తలు తీసుకోవాలి**



శీతాకాలంలో గొర్రెలు, మేకల పెంపకందారులు వాటి ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి. మేతకు వెళ్లిన సందర్భాలలో పసరు మీద ఉన్న మంచుతోపాటు గడ్డిని కూడా మేయడం మూలంగా సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో నట్టల నివారణ మందులు తాగించాలి. జీవాల గిట్టలు, ముక్కును ఎప్పటికప్పుడు గమనిస్తుండాలి. చిన్న అనారోగ్య సమస్య అనిపించినా వెంటనే వైద్యులను సంప్రదించాలి.

-శశాంక్, శాస్త్రవేత్త, కేవీకే మామునూరు

## భార్యపై భర్త దాడి..

● పోలీసులకు బాధితురాలి ఫిర్యాదు.. ● కేసు నమోదు

హసన్‌పర్తి: ప్రియురాలి మోజులో పడిన భర్త.. భార్యపై దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన శనివారం కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎర్రగట్టుగుట్ట ప్రాంతంలో జరిగింది.పోలీసుల కథనం ప్రకారం... హసన్‌పర్తికి చెందిన గడిపె రాంబాబుకు అదే ప్రాంతానికి చెందిన సుప్రియతో పదేళ్ల క్రితం వివాహం జరిగింది.కొంతకాలం పాటు వారి దాంపత్య జీవితం సజావుగానే సాగింది. అయితే కొంతకాలంగా రాంబాబు మరో యువతితో సహజీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం సుప్రియ ఎర్రగట్టు గుట్ట ప్రాంతంలో ఉంటున్న రాంబాబు వద్దకు వెళ్లింది.దీంతో వారి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ సమయంలో ఆగ్రహానికి గురైన రాంబాబు కర్రతో సుప్రియను బాదాడు. అడ్డువచ్చిన మామ వెంకటేశ్వర్లకు కూడా గాయాలయ్యాయి. ఈ ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అబ్బయ్య తెలిపారు.

## పోలీసులకు దొంగ అప్పగింత

లింగాలఘణపురం: మండలంలోని నెల్లుట్లలో శనివారం ఆకుల నర్సయ్య ఇంట్లో చోరీకి పాల్పడుతుండగా నల్లగొండ జిల్లా మోత్కూరుకు చెందిన వ్యక్తిని గ్రామస్తులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఘటనకు సంబంధించి ప్రత్యక్ష సాక్షి సాగరిక కథనం ప్రకారం సాగరిక ఇంటికి గొళ్లెం వేసి పక్కింట్లోకి పాలు తీసుకొచ్చేందుకు వెళ్లింది. తిరిగి వచ్చేలోగా గొళ్లెం తీసి ఉంది. తలుపు తెరువగానే గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లో వస్తువులన్నీ సర్దుతున్నాడు. భయపడిన సాగరిక బయట గొళ్లెం వేసి దొంగ దొంగ అంటూ అరిచింది. ఇంటి పక్కన వారు రాగానే దొంగ ఇంటి వెనుక ఉన్న గోడ దూకి పారిపోయాడు. అందరు వెంబడించగా దొంగ సమీపంలోని మరో ఇంట్లో దాక్కున్నాడు. వెంటనే పట్టుకొని పోలీసులకు సమాచారం ఇవ్వగా స్టేషన్‌కు తీసుకెళ్లి విచారిస్తున్నారు. సుమారు అరతులం బంగారం, పట్టగొలుసులు చోరీ చేసినట్లు బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులె కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నారు.